## ఈ సమాజం యిలా వుంటే ఎంత బావుంటుంది!

బ్యాంకు రద్దీగా వుంది.

ఆ రోజు సోమవారం అవటం వల్లనేమో బ్యాంకు సిబ్బందికి ఊపిరి పీల్చుకోవటానికి కూడా వ్యవధి చిక్కటంలేదు.

పేమెంట్స్ కౌంటర్ వద్ద పదిమందిదాకా గుమికూడి వున్నారు. ఎవరికి వారు తమ పని ముగించుకొని పోదామనే ఆతృతలో ఉన్నవాళ్ళే.

క్యాషియర్ చకచక నోట్లు లెక్కపెడుతున్నాడు. టోకెన్ నెంబర్లు కేకేస్తున్నాడు.

'టోకెన్ నెం. 39 ...'

ఒక వ్యక్తి సందుచేసుకొని లోపలికి దూరాడు.

టోకెన్ తీసుకొని ''ఎంత?'' అడిగాడు క్యాషియర్.

'ఎనిమిది వేల ఐదొందలు''

''వందలివ్వనా?''

'పదులుగాని, ఇరవైలుగాని.'



# యుటోపియా

### ప్రసన్న కుమార్ సర్రాజు

సర్రున డ్రాయర్ లాగివది రూపాయల కట్టలుతీసి టేబిల్ మీద పెట్టాడు. ఒక్కొక్కటీ వెయ్యి రూపాయల కట్ట. విడిగా ఐదువందలుకూడా లెక్కపెట్టి ఆ వ్యక్తికి ఇచ్చి వెంటనే పిలిచాడు

"టోకెన్ నెం 42...."

వెనకాల నిల్చున్నాయన ముందుకిరావడానికి వెడుతుంటే అతను డబ్బు గట్టిగా పట్టుకొని అతికష్టంమీద బయట పడగలిగాడు

జిప్‌బాగ్‌లో డబ్బుపెట్టి ఆటో పిలిచాడు

ఇంటికెళ్ళాక భార్యచేతికి బ్యాగ్ అందించి బాత్రూమ్‌లోకి వెళ్ళాడు. ముఖం తుడుచుకుంటూ బాత్రూమ్‌లోంచి బయటికి వచ్చి భార్య వంక చూశాడు. ఆమె ముందు తను బ్యాంకునుంచి తెచ్చిన డబ్బు వుంది. ఆమె కళ్ళలో ప్రతిఫలిస్తున్న ఆశ్చర్యం చూసి ఒక్కక్షణం ఖంగారుపడ్డాడు. ఆ రద్దీలో డబ్బేమైనా పోలేదుకదా? ఇన్నేళ్ళుగా చమటోడ్చి సంపాదించి దాచిపెట్టిన డబ్బు.... చెల్లెలి పెళ్ళికి.... ఇదికూడా చాలదు. ఇంకా కావాలి. కట్నమే 8 వేలు! పైన కనీసం రెండు వేలుంటేకానీ పెళ్ళిఖర్చులకి సరిపోదు. ఆ రెండు వేలకోసం మళ్ళీ బయల్దేరాలి అప్పుకి....

"ఏమిటి? ఏమైంది?" అడిగాడతను.

"ఎంత పట్టుకొని వచ్చారు?"

అతని గుండె గుభేల్‌మంది. ఇందులో కొంత డబ్బు తగ్గిందంటే ఈ సంబంధం తప్పిపోవటమే కాకుండా మళ్ళీ ఏడాదిదాకా చెల్లెలి పెళ్ళి చేయలేడు.

"ఎంత తగ్గింది?" ధైర్యం చిక్కబట్టుకుంటూ అడిగాడు.

"తగ్గటమేమిటి? బ్యాంకులో ఉన్నది ఎనిమిదివేల ఐదొందలేగా?"

"తొమ్మిదివేల ఐదొందలుంది."

అతను నిశ్చేష్టుడైపోయాడు. చకచక లెఖ్ఖపెట్టాడు నిజమే. ఓ వెయ్యిరూపాయల కట్ట యెక్కువుంది. ఇదెలా జరిగింది? బహుశ.... ఆఁ.... అవును క్యాషియర్ ఒక కట్ట యెక్కువిచ్చి వుంటాడు.

గబగబా చొక్కా వేసుకొని చెప్పులు తొడుక్కున్నాడు

"అదేమిటీ అన్నం తినరూ?" అడిగింది భార్య.

"వచ్చాక తింటాను" అని ఒక వెయ్యి కట్ట జేబులో వేసుకొని బయటికివచ్చి ఆటో పిలిచాడు.

బ్యాంకు దగ్గర ఆగి లోపలికి....సరాసరి ఏజెంటు దగ్గరకు వెళ్ళాడు.

* * *

రైలు కీచుమంటూ ఆగింది. రాత్రి పదిన్నర అయింది. అమావాస్య చీకటి. ఆ స్టేషన్‌లో నిముషం కంటే ఆగదు రైలు.

"తొందరగా ఎక్కమ్మా." గార్డు పచ్చ దీపం ఊపుతున్నాడు". ముసలాయన హడావిడి చేశాడు కూతుర్ని.

"ఎదురుగా ఆగిన కంపార్టుమెంటులోకి ఎక్కేసింది ఆ అమ్మాయి. సూట్‌కేస్ ఎత్తి లోపల పెట్టాడాయన. రైలు కూత పెట్టి నెమ్మదిగా కదిలింది.

"జాగ్రత్తమ్మా. వెళ్ళంగానే కార్డు రాసేయి ఏమైనా అవసరం అయితే వెంకట్రామయ్యగార్ని కలుసుకో. మొహమాట పడకు...." ఆయన జాగ్రత్తలు చెప్తూనే ఉన్నారు. రైలు స్పీడందుకొంది.

తండ్రి కనుమరుగయ్యేదాకా నిలబడి వంగి సూట్‌కేస్ ఎత్తి పై బెర్తుమీద పెట్టింది. ఆ ప్రక్కనే వేరే ఎవరిదో సూట్‌కేస్‌కూడా ఉంది

అపుడు చూసింది. ఎదురుగా అవతలి వరసలో నలుగురు.... కాలేజీ స్టూడెంట్స్‌లాగున్నారు. పేకముక్కలు చేతుల్లో పట్టుకొని ఆమెవంక రెప్పవాల్చకుండా చూస్తున్నారు

కంపార్టుమెంటులో వాళ్ళు నలుగురు తప్ప ఇంకెవ్వరూలేరు!ఆమె ఒక్కక్షణం ఖంగారుపడింది. అయినా మొహంలో ఏ భావం కనిపించనీయకుండా డోర్ ప్రక్కనే కూర్చుంది.

ఒక్కమాటలో చెప్పాలంటే అపరంజి, బాపు బొమ్మ! ముట్టుకుంటే కందిపోయేలాగుంది అనుకున్నారు వాళ్ళు.

పది నిమిషాలు గడిచాయి. రైలు వేగంగా పోతోంది. హఠాత్తుగా కరెంటు పోయింది. కంపార్టుమెంటు చీకటి అయిపోయింది.

"డామిట్. లాస్ట్ జాక్‌పాట్ సగంలో వుండగా పోయిందే! వెధవ ట్రైన్." ఒకడన్నాడు.

"లేద్దామా...."

"ఊరుకోరా! జాక్‌పాట్ సగంలో వుండగా లేస్తే కళ్ళుపోతాయి. ఎలాగైనా ఆట జరగాల్సిందే."

అయిదు నిముషాలు గడిచినా కరెంటు రాలేదు. అప్పటికి కళ్ళు కాస్త చీకటికి అలవాటుపడ్డాయి. వాళ్ళు నలుగురు ఏదో మాట్లాడుకున్నారు. బాపు బొమ్మకి అనుమానం పుడుతోంది.

వాళ్ళలో కాస్త భారీగా ఉన్నతను లేచి నిల్చుని ఒళ్ళు విరుచుకున్నాడు.

"ఒరేయ్ జగ్గూ—లేచి కిటికీలు మూసెయ్యరా!" బొంగురుగొంతుతో అన్నాడతను. మిగతా ముగ్గురికీ అర్థం అయింది.

ఒకడు లేచి ఒక్కో కిటికీ మూసివేయడం ప్రారంభించాడు. బాపూ బొమ్మకి నోరుఎవరో నొక్కేసినట్లు అనిపించింది. చెమటలు పోస్తున్నాయి.

భారీ మనిషి మళ్ళీ ఆజ్ఞలిచ్చాడు. "ఒరేయ్ కాంతీ నువ్వు...."

"అర్థమైంది బాస్" అని మూడోవాడు లేచాడు. నెమ్మదిగా ఒక్కో అడుగువేస్తూ ఆ అమ్మాయివైపు వస్తున్నాడు.

నాలుగో వ్యక్తి లేచి "అబ్బ ఉక్కపోస్తోంది" అని పెద్దగా అంటూ చొక్కా విప్పేస్తున్నాడు

బాపు బొమ్మకి కెవ్వుమనటానికి కూడా గొంతు పెగల్లేదు. మసక చీకట్లో ఒక్కో అడుగే వేస్తూ మీదమీదకి వస్తున్న ఆకారాన్ని గుడ్లప్పగించి చూస్తోంది.

ఆ అమ్మాయి మీదకు వంగాడతను.

అంతే....గట్టిగా కళ్ళు మూసుకుంది నిలువెల్లా వణికిపోతూ

రెండునిముషాలు గడిచాయి. ఇదేమిటి! తన వొంటిమీద ఏ చెయ్యి పడలేదేం! నెమ్మదిగా కళ్ళు తెరిచి చూసింది. కంపార్టుమెంటులో రెండు కొవ్వొత్తులు వెలుగుతున్నాయి. నలుగురూ కూర్చొని పేకాడేస్తున్నారు. సరిగ్గా తన పైన బెర్త్‌మీద వున్న మరోసూట్‌కేస్ వాళ్ళప్రక్కన వుంది.

"షో" వాడతను ముక్కలు క్రింద పరిచాడు.

మిగతా ముగ్గురూ గొణుక్కుంటూ డబ్బులు తీసిచ్చారు. వెంటనే కరెంటు వచ్చింది.

"ఇహ తీసేయండిరా వెధవ పేకాట."

నలుగురూ లేచారు.

ఒకడు కొవ్వొత్తులార్పేసిసూట్‌కేస్‌లో పడేశాడు. ఒకడు లేచి చకచకా కిటికీలు తెరిచాడు చొక్కా బటన్స్ పెట్టుకుంటున్నాడు మరో వ్యక్తి. నలుగురూ లేచి కర్చీఫ్‌తో మొహం తుడుచుకుంటూ వచ్చి ఆమె ఎదురుగా కూర్చున్నారు.

"ఎక్స్‌క్యూజ్‌మి" భారీ వ్యక్తి మాట్లాడాడు "ఇంతాక మా ఆట మంచి పట్టులో ఉండటంతో మీతో మాట్లాడలేకపోయాము. అయామ్ స్వామి. దిసీజ్ జగన్నాథం. వీడు కాంతి ఎపుడూ వెలిగించడం, ఆర్పడం వీడిపని. వాడు మిత్రా, తెలుసు బాగానే వచ్చు. మేమంతా ఎమ్. ఏ. ఫైనల్ చేస్తున్నాం. మీ పేరు తెలుసుకోవచ్చా" మర్యాదగా అడిగాడు.

ఆమె గుటకలు మింగింది. "నా పేరు రాధ" అని తన వివరాలు చెప్పింది.

పావుగంట గడిచింది.

వాళ్ళు నలుగురూ జోక్స్‌వేస్తూ ఆమెను నవ్విస్తున్నారు. ఆమె కిలకిలా నవ్వుతోంది. నవ్వి నవ్వి ఆమె కళ్ళల్లో నీళ్ళు వచ్చాయి.


జగ్గు వాటర్‌బాటిల్ తీసి మంచినీళ్ళు పోసి అందించాడు.

మిత్రా రసగుల్లాలున్న సీసా తెచ్చి చెమ్చాతో రెండు తినమని తినేదాకా బలవంత పెట్టాడు.

"ఓహ్.... నా స్టేషన్ దగ్గరయింది. మీరు మాట్లాడుతుంటే కాలమే తెలియలేదు" చాలా కృతజ్ఞతగా చూసింది రాధ.

"ఇటాల్ రైట్ సిస్టర్. ఎప్పుడైనా మేం గుర్తుకువస్తే మా జోక్స్ గుర్తుకు వచ్చి నవ్వుకుంటే చాలు." చాలా స్వచ్ఛంగా అన్నాడు స్వామి. మిగతా ముగ్గురూ ఏకీభవించారు.

స్టేషన్‌లో రైలాగింది. మిత్రా ఆమె



వద్దంటున్నా వినక ఆమె సూట్‌కేస్ పట్టుకొని దిగి కిందపెట్టాడు. నలుగురూ క్రిందకి దిగారు. ఆమె చేతులు జోడించి నమస్తే చెప్పింది.

రైలు కదులుతూ ఉంటే నలుగురూ ఎక్కేశారు. దూరమయ్యే వరకూ చేతులెత్తి వీడ్కోలు చెప్పారు.

* * *

త్రీటౌన్లో యస్. ఐ. తల వంచుకొని ఏదో రాసుకొంటున్నాడు.

"సార్" అని వినిపిస్తే తల ఎత్తి చూశాడు సెంట్రీ అటెన్షన్‌లో నిలబడి ఉన్నాడు. ప్రక్కనే రక్తసిక్తమైన గుడ్డలతో ఓ 30 యేళ్ళ వ్యక్తి ఉన్నాడు. అతని చేతిలో రక్తంలో తడిసిన కత్తి ఉంది.

చటుక్కున లేచి నిల్చుచున్నాడు "వాటీజ్ దిస్? ఎవరితను?" అడిగాడు సెంట్రీని.

"అడ్డరోడ్డుదగ్గర ఎవరో ఎవరినో పొడిచేసి పారిపోతూఉంటే ఇతను అడ్డు పడ్డాడుట సార్. 'యస్.ఐ. గారున్నారా?' అని అడిగితే మీ దగ్గరికి పట్టుకొచ్చాను."

"సరే. నువ్వెళ్ళు" అని యస్.ఐ. సూటిగా అతనివంక చూశాడు.

"ఏం జరిగింది?" అడిగాడు.

"నేను పొలంనుంచి వస్తూఉంటే తుమ్మచెట్ల వెనకాల చావుకేక వినిపించిందిసార్. నేను పరుగెత్తుకుంటూ వెళ్ళిచూస్తే ఎవరో నలుగురు దుండగులు ఒక ఆసామీని కత్తితో పొడిచేస్తున్నారు. నేనెళ్ళి అడ్డుపడబోతే నన్నుకూడా గాయపరచి పారిపోయారు. కొనఊపిరితోఉన్న అతనిని భుజంమీద వేసుకుని కొంతదూరం నడిచానండీ కానీ దారిలోనేపాపం అతనిప్రాణం పోయింది. శవాన్ని అక్కడే పడుకోబెట్టి చాతీలో దిగబడిన కత్తిని జాగ్రత్తగా కండువాలో చుట్టి సరాసరి మీ దగ్గరికి వచ్చానండి...."

యస్. ఐ. అతని దగ్గరగావెళ్ళి జబ్బ పట్టుకున్నాడు.

"అబ్బా" బాధగా మూలిగాడతను.

"సెంట్రీ" కేకేశాడు యస్. ఐ. "ఏం పరవాలేదు యిలా కూర్చోవోయ్." భుజాలు పట్టుకొని నెమ్మదిగా కుర్చీలో కూర్చోపెట్టాడు


"మీ పేరేమిటి?"

"రామారావు."

"శవం యెక్కడుంది?"

"అడ్డరోడ్డుకి 3 కిలోమీటర్ల యివతల పొలం గట్టుమీద."

సెంట్రీ వచ్చాడు. "వెళ్ళి ఒక సోడా తీసుకొని రా. అలాగే రెండు వేడి కాఫీలు



రామప్ప శిల్పం

ఫొటో : రఘువర్మ. హైదరాబాద్

కూడా చెప్పు". అని చక చకా కంట్రోల్ రూమ్‌కి ఫోన్‌చేసి పెట్రోల్ వాన్‌ని శవం ఉన్నచోటుకి పంపించే ఏర్పాట్లు చేశాడు. తను కూడా ఓ పదినిముషాల్లో అక్కడకు చేరుకుంటానని చెప్పి ఫోన్ పెట్టేసి గవర్నమెంట్ హాస్పిటల్‌కు ఫోన్‌చేశాడు.

"నేనిక వెళ్ళవచ్చా?" అడిగాడతను నీరసంగా. జరిగిన భయానక సంఘటన తాలూకు ప్రభావం అతని కళ్ళల్లో ప్రతిఫలిస్తోంది.

"భలేవారే. ఈ పరిస్థితిలో మీరింటికి వెళ్తే ఎలా? 5 నిముషాల్లో అంబులెన్స్ వస్తుంది. మిమ్మల్ని హాస్పిటల్లో ఎడ్మిట్ చేయిసాను. మీ అడ్రస్ ఇవ్వండి. మీ ఇంటికి కబురుచేస్తాను మీరు కోలుకున్నాక స్టేట్‌మెంట్ రాసుకుంటాను. ఏం భయంలేదు ఖంగారుపడి మనసు పాడుచేసుకోకండి" అనునయంగా చెప్పాడు యస్. ఐ.

"పాపం ఆ వ్యక్తి...."

"త్వరలోనే హంతకుల్ని పట్టుకుంటాం." అంటుంటే సెంట్రీ సోడా తెచ్చాడు వెనకాలే కాఫీ కప్పులతో హోటల్ కుర్రాడు వున్నాడు.

సోడా త్రాగాడతను. కాస్త ప్రాణం లేచినట్లనిపించింది. కాఫీ త్రాగుతుండగా అంబులెన్స్ వచ్చింది. ఈలోగా యస్.ఐ. అతని అడ్రస్ తీసుకున్నాడు. మెట్లు దిగి అతన్ని మెల్లగా నడిపించుకుంటూ తీసుకెళ్ళి అంబులెన్స్‌లో పడుకోబెట్టారు. వెంట ఒక కానిస్టేబుల్‌ని కూడా పంపాడు యస్.ఐ. తుండుగుడ్డలో ఉన్న కత్తిని జాగ్రత్తగా దాచి మోటార్ సైకిల్ స్టార్ట్ చేశాడు.

* * *

పాఠక మహాశయుల్లారా! ఇదీ కథ.

ఈ కథ చదివాక. ఠాఠ్ ఎక్కడైనా ఇలా జరుగుతుందా? అప్పనంగా వచ్చిన డబ్బు వాపస్ చేయుటము. అందమైన అమ్మాయి ఒంటరిగా దొరికితే వదిలేయడమూ. స్టేషన్‌లోకి కత్తిపట్టుకొని రక్తసిక్తమైన బట్టలతో ప్రవేశించినవ్యక్తికి పోలీసు అధికారి గౌరవమిచ్చి మాట్లాడటము — ఇంపాజిబుల్. చాలా అసహజంగా ఉందీ కథ అని అనుకునేవాళ్ళు - చాలాసహజంగా ఈయుగంలో, ఈ సమాజంలో జీవిస్తున్నవారే. వారిగురించి ప్రత్యేకించి చెప్పేదేమీ లేదు.

కానీ — ఏమిటీ కథ?.. ఏవో మూడు సంఘటనలు రాసి కథగా చదమంటేఎలా ఏముందీ కథలో? మామూలుగానే వుంది కదా! అని సహజంగా భావించి పక్కపేజీలోకి చక్కాపోయేవారుచాలాఅసహజంగా ఈ యుగంలో, ఈ సమాజంలో జీవిస్తున్నట్టు చెప్పుకతప్పదు. ఎవరైనా ఈరెండో కోవకి చెందిన మహాశయులు నాకెప్పుడైనా తటస్థపడితే, వారికి చేతులెత్తి నమస్కరిస్తాను.

